# తీరని తపన

"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్।
పర్యుత్సుకో భవతి యత్సుఖి తోఽపి జన్తుః
త చ్చేతసా స్మరతి నూన మబోధ పూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాని."

సుందరమైన దృశ్యము, మధురమైన భావము గీతము హృదయంలో రేపే తపన! దీనికి అర్థమేమిటి? ఎందుకోసము? యుగయుగాలుగా ప్రతి హృదయమూ పరితపిస్తూనేవుంది. అందనిదానికోసం అటమటిస్తూనేవుంది.

చుట్టుకున్న అన్నింటిమీద విరక్తి విముఖత్వము! తీరని తపన! భరించలేని ఆవేదన! అంతా ఎందుకో తెలియకుండా! పలుకగలిగిననోట ఇది పాటయై, పద్యమై వెలసింది. మూగపోయిన గొంతులో ఇది రగిలిరగిలి అణగింది.

ఇది ఆత్మ పరమాత్మ కోసం అనంతంగా పొందే ఆరాటమా! ఈ ఆత్మకు ఎడతెగని వియోగము! స్వవాసము వదలి పరవాసము! ఇక్కడ సుఖములేదు. శాంతి

లేదు. విముక్తి లేదు బంధాలు తెగవు! గాలిలో తేలిపోవాలి. రెక్కలు వినువీధిలో రెపరెపమంటే, కాళ్ళు గజ్జెలతో కదల లేవు! ఈ బ్రతుకు బ్రతకలేదు. త్రోవతప్పిన దెక్కడో చేర వలసిన దెక్కడో తెలియక పరితపిస్తుంది! ఇది మనసులో దాగని మధురభావం!

పరమాత్మ దీనికొక సుందరగమ్యం! అర్థరహితమైన దీనికొక ఆధారం! అప్పుడు ఈ తపన తీరని తపన! అందే వస్తువులతో అది అణగదు! సుందరమైన స్వప్నము ఎప్పుడూ సుదూరమే! చేతి కందితే అది సుందరమూ కాదు! స్వప్నమూ కాదు!

అందుకే ఊరూ పేరూ అకారమూలేని వానికోసమే ఈ ఆరాటము! నామరూప రహితుడు, పరిపూర్ణ సౌందర్య మూర్తి, పరిపూర్ణానంద స్వరూపుడు, పలకకుండానే పలుకు తున్నట్లు మురిపించేవాడు. కనిపించకుండానే కనిపిస్తున్నట్లు స్ఫురించేవాడు, కరుణారసం వెల్లివిరిసేవాడు, పవిత్ర ప్రేమ మూర్తి—ఇంతకన్న కోరుకోదగినవా రెవరు? ఈతని వల చినవారికి అనంత వియోగమే! ఎడతెగని ఆరాటమే! ఈ తీరని తపనే మైమరపించే భక్తిభావం, మధురభావం

"మోహన రామా! మోహము నీపై మొనసియున్న దిరా!" "పలుకవేమి నా దైవమా" "అడియాసలచే తగిలి ఆర్తిబడి విడజాలదురా నా మనసు, విడనాడకురా నన్ను" అని పరిపరివిధాల పరితపించాడు త్యాగరాజు. "దరసబినా

దూఖనాలాగేన్నైన", "క్ష్యంతరసావే అంతర యామీ అనమిలో కృపాకర స్వామీ" అని వాపోయింది మీరా, ఈ తపన భరించలేక. "పసలేని యీ బ్రదుకు అసలు చొచ్చి చొచ్చి అలసినట్లాయె, ఎటు సేయగలవాడనో, యిక నీ చేతిది నా వునికి, సారెకు గొలువు సేతు, చనువులు నీ విత్తువోయనుచు, చేరకున్నా గాచుకుచు నీవు మెత్తువనుచు" అని పలవించాడు అన్నమయ్య. "లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె—కావవే వరదా !"

అని మొరపెట్టుకున్నాడు పోతన గజేంద్రుని గొంతుతో.

యుగయుగాలుగా మానవహృదయంలో ఈ తపన ఆరనేలేదు.